క్లుప్తంగా

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



వార్డులో ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న సీపీ సుధారాణి

తుని: అర్హతే ప్రామాణికంగా ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి అన్నారు. స్థానిక 29వ వార్డులో కౌన్సిలర్ దోసపర్తి రాజేశ్వరి ఆధ్వర్యాన గురువారం సాయంత్రం మన మున్సిపాలిటీ - మన బాధ్యత కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి మహిళల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అర్హత ఉండి ప్రభుత్వ పథకాలు అందకపోతే సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా కృషితో ప్రభుత్వం నుంచి వస్తున్న నిధులతో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని చెప్పారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గం అధ్యక్షుడు ఏలూరి బాలు, మున్సిపల్ వైస్ చైర్మన్ పామర్తి మహేష్, జెడ్‌ఆర్‌యూసీసీ సభ్యుడు బోడపాటి శ్రీను, జిల్లా వక్ఫ్‌బోర్డు వైస్ చైర్మన్ షేక్ ఖ్వాజా, గాంధీ సత్రం చైర్మన్ అనిశెట్టి సూర్యచక్రరెడ్డి, మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు, కౌన్సిలర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

వైభవంగా నృసింహ జయంతి



నృసింహ జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు చేస్తున్న స్వామీజీ

తుని రూరల్: కుమ్మరిలోవలోని తపోవనం సచ్చిదానంద ఆశ్రమంలో నృసింహ జయంతి గురువారం వైభవంగా నిర్వహించారు. పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతి మహాస్వామి ఆధ్వర్యాన వేద పండితులు, వేద విద్యార్థులు ప్రత్యేక పూజలు చేశారు. నృసింహారాధన, వేద పారాయణ, భాగవత పారాయణ, సర్వరక్షాకర నృసింహ అనుష్టుప్ హోమం, మహా సుదర్శన హోమం, సహస్ర కమలార్చన, తులసీ అర్చన నిర్వహించారు. నృసింహ స్వామిని భక్తిభావంతో కొలిచే వారికి సుఖశాంతులు ప్రాప్తిస్తాయని స్వామీజీ అన్నారు. నృసింహ జయంతి సందర్భంగా ఆశ్రమ ప్రాంగణంలో వివిధ రంగులతో స్వామివారి రూపాలు తీర్చిదిద్దారు.

మేడే స్ఫూర్తితో పోరాటాలు



మేడే జెండా ఎగురవేస్తున్న కర్నాకుల

గోకవరం: మేడే స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ పోరాట పంథాలో పయనించాలని ఆంధ్రప్రదేశ్ రైతుకూలీ సంఘం ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు అన్నారు. మేడే వారోత్సవాల్లో భాగంగా రంపయర్రంపాలెంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయన జెండా ఎగురవేశారు. గ్రామంలోని సుమారు 89 ఎకరాల సుందరమ్మ సత్రం భూములను ఏళ్ల తరబడి కొంతమంది తమ ఆధీనంలో ఉంచుకుని అక్రమంగా అనుభవిస్తున్నారన్నారు. ఈ భూములపై సంఘం ఆధ్వర్యంలో మేడే స్ఫూర్తితో అలుపెరగని పోరాటం చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రమేష్, సహాయ కార్యదర్శి కడితి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బుద్ధ పౌర్ణమి వేడుకలు



చీకట్ల వెంకటేశ్వరరావును సన్మానిస్తున్న నిర్వాహకులు

ప్రత్తిపాడు రూరల్: దారపల్లి శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామి క్షేత్రంలో గురువారం బుద్ధ పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పత్రీజీ పిరమిడ్ ధ్యాన మండలి ఆధ్వర్యాన ఆధ్యాత్మిక ధ్యాన యజ్ఞం పార్ట్-1లో భాగంగా ఈ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆధ్యాత్మిక గురువు చీకట్ల వెంకటేశ్వరరావు, ప్రభావతి, మాజీ సర్పంచ్ నిమ్మల అప్పారావును ఘనంగా సన్మానించారు.

చర్చి నిర్మాణానికి శంకుస్థాపన

కిర్లంపూడి: చిల్లంగి గ్రామంలో కొత్త చర్చి నిర్మాణానికి కిర్లంపూడి సొసైటీ అధ్యక్షుడు చదలవాడ బాబీ గురువారం శంకుస్థాపన చేశారు. క్రాస్ యూత్ మినిస్ట్రీస్ ఆధ్వర్యాన ఈ చర్చి నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కాళ్ళ దొంగబాబు తదితరులు పాల్గొన్నారు.

జోరుజోరుగా..

- బెండపూడి నుంచి భారీగా మామిడి ఎగుమతులు
- ప్రతి రోజూ 80 టన్నుల వరకూ ఇతర రాష్ట్రాలకు..

తొండంగి: సీజన్ వచ్చిందంటే చాలు.. బెండపూడి గ్రామం మామిడి కాయల ఎగుమతుల కార్యకలాపాలతో కళకళలాడుతుంది. ఇక్కడి నుంచి పలు రకాల మామిడి కాయలు జిల్లాలోని వివిధ ప్రాంతాలతో పాటు ఇతర రాష్ట్రాలకు భారీగా ఎగుమతి అవుతున్నాయి. తొండంగి మండలం శృంగవృక్షం, పి.అగ్రహారం, పీఈ చిన్నాయపాలెం, ఎ.కొత్తపల్లి, కొమ్మనాపల్లి, సీతారాంపురం, రావికంపాడు, బెండపూడి, తమ్మయ్యపేట, పైడికొండ, కృష్ణాపురం, గోపాలపట్నం తదితర గ్రామాలు, తీరప్రాంతం కలిపి 1,800 ఎకరాల్లో మామిడి సాగు జరుగుతోంది. బంగినపల్లి, సువర్ణరేఖ, తోతాపురి, చెరకు రసాలు, కొత్తపల్లి కొబ్బరి వంటి మామిడి రకాలు ఇక్కడ పండిస్తారు. ఆయా గ్రామాల నుంచి జాతీయ రహదారిపై బెండపూడి వద్ద ఉన్న స్టాక్ పాయింట్లకు ఈ మామిడి కాయలను రైతులు తరలిస్తారు. డిమాండ్‌ను బట్టి ఆయా కాయలను గ్రేడింగ్ చేసి, ఎగుమతి చేస్తున్నారు. ఇక్కడి నుంచి ప్రతి రోజూ 50 నుంచి 80 టన్నుల వరకూ మామిడి కాయలను లారీలు, మినీ వ్యాన్లపై జిల్లాలోని వివిధ ప్రాంతాల్లోని పండ్ల మార్కెట్లతో పాటు ఒడిశా, కోల్‌కతా, కటక్, భువనేశ్వర్, రాయ్‌పూర్ వంటి ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. ప్రతి రోజూ దాదాపు 3 వేల నుంచి 5 వేల టన్నుల వరకూ ఇక్కడి నుంచి ఎగుమతులు జరుగుతున్నాయి. ప్రస్తుతం టన్ను బంగినపల్లి ధర రూ.30 వేలు, సువర్ణరేఖ రూ.35 వేలు, తోతాపురి రూ.18 వేలు, చెరకు రసాలు రూ.25 వేలు, కొత్తపల్లి కొబ్బరి రూ.60 వేలు ఉందని రైతులు, వ్యాపారులు చెబుతున్నారు. వేసవిలో పనుల్లేక ఇబ్బందులు పడుతున్న బెండపూడి, తమ్మయ్యపేట పరిసర ప్రాంతాల ప్రజలకు ఇక్కడ తాత్కాలికంగా ఉపాధి లభిస్తోంది. మామిడి కాయల గ్రేడింగ్, ట్రేల్లో ప్యాకింగ్, లారీల్లో ఎగుమతి వంటి పనుల ద్వారా దాదాపు 200 మంది ఈ కేంద్రాల్లో ఉపాధి పొందుతున్నారు.



బెండపూడిలో మామిడి కాయలు గ్రేడింగ్ చేస్తున్న రైతులు, వ్యాపారులు

పెరుగుతున్న ఎగుమతులు



మండలంలో మామిడి సాగు పెరుగుతోంది. మామిడిపై తెగుళ్ల నివారణకు రైతులకు ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు ఇస్తున్నాం. పిచికారీ యంత్రాలను రాయితీపై అందిస్తున్నాం. మామిడి కాయల ఉత్పత్తి పెరగడంతో ఇతర రాష్ట్రాలకు కూడా ఎగుమతి చేస్తున్నారు.

– పి.తాతాజీ, గ్రామ సచివాలయ హార్టికల్చర్ అసిస్టెంట్, జి.ముసలయ్యపేట

ధరలు పెరిగితేనే గిట్టుబాటు



అకాల వర్షాల కారణంగా మామిడి తోటలు దెబ్బతిన్నాయి. ఈదురు గాలులకు కాయలు రాలిపోవడం, తెగుళ్ల కారణంగా దిగుబడి దెబ్బ తింటోంది. నాణ్యతను బట్టి మామిడి కాయలను గ్రేడింగ్ చేసి, ఎగుమతి చేస్తున్నాం. ప్రస్తుతం ఉన్న ధరలు కాస్త పెరిగితే తప్ప గిట్టుబాటు కాదు.

– ఎస్.చినస్వామి, మామిడి రైతు, తమ్మయ్యపేట, తొండంగి మండలం

ముద్రగడ నివాసంలో అభిమానుల సందడి



అభిమానులతో ముద్రగడ

కిర్లంపూడి: అభిమానులతో మాజీ మంత్రి, కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం గురువారం నివాసం సందడిగా మారింది. రైలు దహనం ఘటనలో ముద్రగడతో కాపు నేతలపై ఉన్న కేసును కోర్టు కొట్టివేసిన నేపథ్యంలో కిర్లంపూడిలోని ఆయన అభిమానులు సంబరాలు చేసుకున్నారు. ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి ముద్రగడ నివాసానికి భారీగా తరలివచ్చి ఆయన అభినందనలు తెలిపారు. వారికి ముద్రగడ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, నీతి నిజాయితీకి ముద్రగడ మారుపేరని కొనియాడారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

తుని/రౌతులపూడి: తాండవ 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని కత్రాళ్లకొండ, సీతారాంపురం 11 కేవీ ఫీడర్లలో డబుల్ జంపరింగ్, రోడ్డు క్రాసింగ్ మరమ్మతు పనులు చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీ ఈపీడీసీఎల్ ఈఈ కె.రత్నాలరావు గురువారం తెలిపారు. ఆ సమయంలో పట్టణంలోని 1 నుంచి 10 వార్డులకు చెందిన కొండవారిపేట, టైలర్స్ కాలనీ, అమ్మాజీపేట, సీతారాంపురం, కంకిపాటి గరువు, శ్రీనివాసా సెంటర్, ఆర్టీసీ కాంప్లెక్స్, రెల్లి కాలనీ, డ్రైవర్స్ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని వివరించారు. అలాగే, రౌతులపూడి 33 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని రౌతులపూడి రూరల్ 11 కేవీ ఫీడర్‌పై ఉన్న అన్ని గ్రామాల్లోనూ శుక్రవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుంది. లైన్ల వార్షిక మరమ్మతులు, ఇతర సాంకేతిక సమస్యల పరిష్కారానికి ఆ సమయంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని రత్నాలరావు తెలిపారు.

జడ్జి నివాస భవనానికి రేపు శంకుస్థాపన

ప్రత్తిపాడు: స్థానిక జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు ఆవరణలో జడ్జి నివాస భవనానికి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సీహెచ్ మానవేంద్రనాథ్‌రాయ్ శనివారం శంకుస్థాపన చేయనున్నారు. స్థానిక బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చిట్టంశెట్టి పుల్లయ్య, ప్రధాన కార్యదర్శి బొంగుకురి మధుబాబు గురువారం ఈ విషయం తెలిపారు. కార్యక్రమంలో హైకోర్టు జడ్జి జస్టిస్ మల్లికార్జునరావు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత తదితరులు పాల్గొంటారని చెప్పారు.

నేటి నుంచి ఈటీసీలో టీఓటీలకు శిక్షణ

సామర్లకోట: ఆయా జిల్లాల్లోని పంచాయతీ కార్యదర్శుల పనితీరు మరింత మెరుగుపడేలా శుక్రవారం నుంచి శిక్షణ ప్రారంభిస్తున్నట్లు ఈటీసీ మేనేజర్ పి.శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ బ్యాచ్‌కు 40 మంది టీఓటీలకు మూడు బ్యాచ్‌లలో 120 మందికి శిక్షణ ఉంటుందన్నారు. సీనియర్ పంచాయతీ కార్యదర్శులు, ఈఓపీఆర్డీలను టీఓటీలుగా ఎంపిక చేసినట్టు చెప్పారు. ఈ మేరకు శుక్రవారం పార్వతీపురం మన్యం, విజయనగరం, శ్రీకాకుళంలోని టీఓటీలకు శిక్షణ ప్రారంభం అవుతుందని చెప్పారు.

ఆట.. పతకాల వేట

- క్రీడా పోటీల్లో సత్తా చాటుతున్న జగ్గంపేట విద్యార్థులు
- మెరికల్లా తీర్చిదిద్దుతున్న వ్యాయామోపాధ్యాయులు



కబడ్డీలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

జగ్గంపేట: ఆట ఏదయినా బరిలోకి దిగితే పతకాలు పట్టాల్సిందే అంటున్నారు జగ్గంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు. ఇప్పటికే రాష్ట్ర స్థాయిలో కరాటే, కుంగ్‌ఫూ, జుడో వంటి మార్షల్ ఆర్ట్స్‌తో పాటు కబడ్డీ వంటి క్రీడల్లో సత్తా చాటి పలు పతకాలు సాధించారు. వ్యాయామోపాధ్యాయులు బి.శివ, బి.మురళీకుమార్ పర్యవేక్షణలో కరాటే, కుంగ్‌ఫూలో 30 మంది, కబడ్డీలో 20 మంది విద్యార్థినీ విద్యార్థులు శిక్షణ పొందుతూ, వివిధ ప్రాంతాల్లో జరిగే పోటీల్లో పాల్గొంటూ, పతకాలు సాధిస్తున్నారు. జాతీయ స్థాయిలో రాణించి క్రీడా కోటాలో ఉన్నతోద్యోగాలు సాధించాలన్నదే తమ లక్ష్యమని వారు ఘంటాపథంగా చెబుతున్నారు. వీరితో పాటు 6వ తరగతి చదువుతున్న కె.వాణి, 9వ తరగతి చదువుతున్న పి.శశికళ రాష్ట్రస్థాయి కబాడీలో తమ సామర్థ్యాన్ని చూపించారు.

చదువు పూర్తయినా శిక్షణ



మా విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరుస్తున్నారు. హైస్కూల్ విద్య పూర్తయినా, కబడ్డీ, కరాటే, కుంగ్‌ఫూలో రాష్ట్ర స్థాయిలో అత్యంత ప్రతిభ కనబరచిన విద్యార్థులకు శిక్షణ కొనసాగిస్తాం. వివిధ ప్రాంతాల్లో జరిగే పోటీలకు తీసుకువెళ్తాం. వీరందరూ జాతీయ స్థాయికి ఎంపికవుతారని ఆశిస్తున్నా.

– బి.మురళీకృష్ణ, వ్యాయామోపాధ్యాయుడు

మంచి భవిష్యత్



జాతీయ స్థాయి క్రీడాకారులుగా కొనసాగిన వారికి మంచి భవిష్యత్ ఉంటుంది. ఒకసారి జాతీయ స్థాయిలో ఆడిన వారు తరచూ జాతీయ స్థాయి సెలక్షన్స్‌లో ఎంపిక కావాలి. తద్వారా వారికి క్రీడాకారుల కోటాలో మంచి ఉద్యోగాలు రావడానికి అవకాశం ఉంటుంది.

– బి.శివ, వ్యాయామోపాధ్యాయుడు

గోల్డ్ మెడల్ కోసం కృషి



విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి కుంగ్‌ఫూ పోటీల్లో రజత పతకం సాధించాను. గోల్డ్ మెడల్ సాధించాలనే లక్ష్యంతో కృషి చేస్తున్నా. జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనాలని ఉంది.

– ఎం.ప్రసన్న, 9వ తరగతి

జాతీయ స్థాయికి ఎదగాలని..



రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ జుడో పోటీల్లో కాంస్య పతకం సాధించాను. జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని, సత్తా చాటాలని ఉంది.

– డి.దుర్గా ప్రవీణ్, 9వ తరగతి

జాతీయ స్థాయిలో రాణించాలన్నదే లక్ష్యం



వ్యాయామోపాధ్యాయుల సహకారంతో చిత్తూరు జిల్లా నగరిలో జరిగిన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొని, జాతీయ స్థాయికి ఎంపికయ్యాను. ఎంతో ఆనందంగా ఉంది. జాతీయ స్థాయిలో రాణించి, జగ్గంపేటకు మంచి గుర్తింపు తేవాలని పట్టుదలతో కృషి చేస్తున్నాను.

– ఎం.వెంకట దుర్గా మహాలక్ష్మి, 9వ తరగతి

క్రీడా కోటాలో ఉద్యోగం సాధిస్తా..



విజయనగరంలో జరిగిన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో ప్రతిభ చూపాను. అలాగే, విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి కుంగ్‌ఫూ పోటీల్లో కాంస్య పతకం సాధించాను. నగరిలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో నుంచి కొద్దిపాటి తేడాలో జాతీయ స్థాయికి ఎంపిక కాలేకపోయాను. కబడ్డీ, కుంగ్‌ఫూల్లో జాతీయ స్థాయిలో రాణించి క్రీడా కోటాలో మంచి ఉద్యోగం సాధించాలని ఆశిస్తున్నాను.

– పాలిక భవాని, 10వ తరగతి

చెత్త, వ్యర్థాల తొలగింపు

శంఖవరం: కత్తిపూడిలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెత్త, వ్యర్థాలను, డ్రైన్లలో పూడికలను పంచాయతీ సిబ్బంది గురువారం తొలగించారు. గ్రామం నలుమూలలా బ్లీచింగ్ చల్లి, దోమల మందు పిచికారీ చేశారు. వాటర్ ట్యాంకులను బ్లీచింగ్ వేసి, శుభ్రపరిచారు. ఈ సందర్భంగా సర్పంచ్ కొల్లు సత్తిబాబు మాట్లాడుతూ, పరిసరాల పరిశుభ్రతతోనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. గ్రామ పరిశుభ్రతే లక్ష్యంగా అధికారులు పని చేయాలని సూచించారు.

నేటి నుంచి ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన ఉత్సవాలు

గోకవరం: పర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో ధ్వజస్థంభం పునఃప్రతిష్ఠాపన మహోత్సవాలు గోకవరంలో శుక్రవారం ప్రారంభమవుతాయని ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు తెలిపారు. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ ఉత్సవాల సందర్భంగా శుక్ర, శని వారాల్లో ప్రత్యేక పూజలు, హోమాలు జరుగుతాయని, ఆదివారం ధ్వజస్థంభం పునఃప్రతిష్ఠ జరుగుతుందని చెప్పారు. మధ్యాహ్నం భారీ అన్నదానం జరుగుతుందని, ఈ కార్యక్రమాలను భక్తులు జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఫస్ట్ ఎయిడ్ కిట్ల అందజేత



డిపో మేనేజర్‌కు ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందిస్తున్న వికాస్‌కుమార్

తుని: స్థానిక ఆర్టీసీ డిపోలోని 70 బస్సులకు 70 ప్రథమ చికిత్స కిట్లను మమతా ఆసుపత్రి సీఈఓ వికాస్‌కుమార్ గురువారం అందించారు. ఆసుపత్రి యాజమాన్యానికి డిపో మేనేజర్ కిరణ్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ ప్రథమ చికిత్స కిట్లను అన్ని బస్సుల్లోనూ అందుబాటులో ఉంచుతామని చెప్పారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ రమణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌బీకేల ద్వారా తడిసిన ధాన్యం కొనుగోలు



ఒమ్మంగిలో వర్షానిక తడిచిన పొలాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ గోపాలకృష్ణ, వ్యవసాయాధికారి గంగాధర్



భూపాలపట్నంలో తడిసిన వరి పనలను పరిశీలిస్తున్న ఎంపీపీ తోట రవి, వైఎస్సార్ సీపీ నాయకులు తోట గాంధీ

ప్రత్తిపాడు రూరల్: తడిసిన ధాన్యాన్ని రైతుభరోసా కేంద్రాల (ఆర్‌బీకే) ద్వారా కొనుగోలు చేస్తామని తహసీల్దార్ పీవీవీ గోపాలకృష్ణ అన్నారు. ఒమ్మంగి గ్రామంలో వర్షానికి తడిసిన వరి చేలను మండల వ్యవసాయాధికారి వై.గంగాధర్‌తో కలిసి గురువారం ఆయన పరిశీలించారు. వ్యవసాయాధికారి గంగాధర్ మాట్లాడుతూ, పొలాల్లో నీరు లేకుంటే వరి పనలపై లీటరు నీటికి 50 గ్రాముల ఉప్పు కలిపిన ద్రావణం పిచికారీ చేయాలని సూచించారు. పొలాల్లో నీరుంటే పనలను ఎత్తయిన ప్రదేశానికి తరలించి, ఉప్పు ద్రావణం పిచికారీ చేయాలన్నారు. తడిసిన పనలపై ఎకరానికి 25 కేజీల ఉప్పు జల్లుతూ కుప్ప వేయాలని చెప్పారు. దీనివలన మొలకలు రావడాన్ని, ధాన్యం రంగు మారడాన్ని నివారించవచ్చని తెలిపారు. తడిసిన ధాన్యం కొనుగోలు కోసం ఆర్‌బీకేలోని సహాయకులను సంప్రదించాలని సూచించారు.

ఆందోళన వద్దు

కిర్లంపూడి: అకాల వర్షాలతో ధాన్యం తడిసిన రైతులు ఆందోళన చెందవద్దని ఎంపీపీ తోట రవి అన్నారు. వీరవరం, ఎస్.తిమ్మాపురం, గెద్దానాపల్లి, ముక్కొల్లు, భూపాలపట్నం, బూరుగుపూడి గ్రామాల్లోని పొలాల్లో నీట మునిగిన పంట పొలాలను తోట గాంధీ, ఏఓ జోకా అమృతతో కలిసి ఆయన పరిశీలించారు. మండలంలో 50 శాతం పంట పనలపై ఉండగా, కొన్నిచోట్ల చేలు పూర్తిగా నీట మునిగాయని అన్నారు. రంగు మారిన ధాన్యాన్ని మద్దతు ధరతో ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని చెప్పారు.

బయటపడిన ఉపాధి సిబ్బంది బాగోతం

- బినామీ పేర్లతో మస్తర్ల సొమ్ము స్వాహా
- కూలీలు రాకుంటే బయట కూలీలతో పనులు
- వేట్లపాలెంలో సిబ్బందిపై ఆరోపణలు

సామర్లకోట: మండల పరిధిలో మేజర్ పంచాయతీ వేట్లపాలెం ఉపాధి సిబ్బంది అవినీతి గురువారం బయట పడింది. గ్రామానికి చెందిన బి.వీరవెంకట సత్యనారాయణ ఉపాధి హామీ సిబ్బంది అవినీతిపై విచారణ చేయాలని ఇటీవల డ్వామా పీడీ, ఎంపీడీఓలకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. గత పాలకుల సూచనల మేరకు ఉపాధి హామీలో అవకతవకలు జరిగాయని ఆయన ఫిర్యాదు చేశాడు. దాంతో డ్వామా ఏపీడీ వసంత మాధవి ఆధ్వర్యంలో సుమారు నాలుగు గంటల పాటు పంచాయతీ కార్యాలయం వద్ద విచారణ చేశారు. గ్రామంలోని ఉపాధి హామీ మేట్లు బినామీ పేర్లతో మస్తర్లు వేసి సొమ్ము స్వాహా చేశారని తెలిపారు. ఈ మేరక ఏపీడీ ఉపాధి హామీ మేట్లను ప్రశ్నించగా ఉపాధి హామీ కూలీలు రాని సమయంలో బయట కూలీలతో పని చేయించినట్లు మేట్లు కొంతమంది మేట్లు అంగీకరించారు. అలాగే ఉపాధిహామీ నిధులతో గ్రామంలోని పేదలకు మరుగుదొడ్లు నిర్మించకుండా నిధులు స్వాహా చేశారని ఉపాధి కూలీలు, గ్రామస్తులు ఆరోపించారు. మరుగుదొడ్లకు ప్రభుత్వం నుంచి లబ్ధి పొందినట్లు ఉండటంతో ప్రస్తుతం జగనన్న కాలనీలలో ఇళ్ల నిర్మాణానికి బ్యాంకు నుంచి రుణం రావడం లేదని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై పూర్తి విచారణ చేసి న్యాయం చేయాలన్నారు. ఉపాధి హామీ మేట్లపై చర్య తీసుకోవడానికి పీడీ దృష్టికి తీసుకువెళ్తామని వసంత మాధవి తెలిపారు. ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, ఎంపీడీఓ డి శ్రీలలిత, ఏపీఓ ప్రభాకరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు గోలి బాబ్జీ, నిడదవోలు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

బీమా.. కర్షకుడికి ధీమా

- ప్రకృతి కన్నెర్రజేస్తే ఆదుకునే పరిహారం
- ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా మంజూరు
- రైతుకు, కౌలుదారుకు రక్షణ కవచం



కరప: ఆరుగాలం కష్టపడి పండించిన పంటను ప్రకృతి వివిధ రూపాల్లో తన్నుకుపోతుంటే అన్నదాతను ఆదుకునేవి పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ తదితర పథకాలు. జరిగిన నష్టం నుంచి తేరుకోవాలంటే వీటిని తమ పనిలో భాగం చేసుకుని క్రమం తప్పకుండా సంబంధిత అధికారులను సంప్రదించి ఉపశమనం పొందవచ్చు. గతంలో ఇన్‌పుట్ సబ్సిడీ ఉండేదికాదు. పంటల బీమా కూడా రైతులు పీఏసీఎస్‌లలో కానీ, వాణిజ్య బ్యాంకులలో కానీ తీసుకున్న పంట రుణాలకు బీమా ప్రీమియం కట్టించుకునేవారు. అధిక వర్షాలకు, తుపాన్లకు పంటపొలాలు ముంపునకు గురై నష్టం వాటిల్లితే పంట రుణం తీసుకున్న రైతులకే బీమా వర్తించేది. బ్యాంకులు, సొసైటీల్లో తీసుకున్న రుణాన్ని బట్టి బీమా శాతం లెక్క కట్టేవారు. కౌలు రైతుకు ఒక్క రూపాయి కూడా ముట్టేది కాదు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక వ్యవసాయం లాభసాటిగా చేయాలన్న సంకల్పం, ప్రకృతి వైపరీత్యాలు వస్తే రైతులను ఎలా ఆదుకోవాలో ఆలోచించి రైతుభరోసా కేంద్రాలు (ఆర్‌బీకే) ఏర్పాటు చేశారు. రైతులు ఒక్క రూపాయి కూడా ప్రీమియం చెల్లించకుండా ప్రభుత్వమే రైతుల తరపున చెల్లించి, ఉచిత పంటల బీమా అమలు చేస్తోంది. సాగు ప్రక్రియలో ఏ దశలో వైపరీత్యాలు సంభవించి నష్టం వాటిల్లినా ఇన్‌పుట్ సబ్సిడీ మంజూరు చేసి రైతులను ఆదుకుంటున్నారు.

ఈ-క్రాప్, ఈ-కేవైసీ తప్పనిసరి

రైతుకైనా, కౌలు రైతులకైనా ఇన్‌పుట్ సబ్సిడీ రావాలన్నా, పంటల బీమా మంజూరు కావాలన్నా ముందుగా ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలి. ఆర్‌బీకే ద్వారా వీఏఏ లాగిన్‌లో రైతు తన వివరాలతో ఈ-క్రాప్ నమోదు చేయించుకుని, ఈ-కేవైసీ చేయాలి. ఆ తర్వాత వీఆర్‌ఓ దానిని నిర్ధారించాలి.

ఇన్‌పుట్ సబ్సిడీ వచ్చేదిలా..

ప్రకృతి విపత్తుల వల్ల జరిగిన నష్టాన్ని రైతు సదరు వివరాలను వ్యవసాయ, రెవెన్యూ అధికారులకు తెలియజేయాలి. ఆ మేరకు వారు క్షేత్రస్థాయిలో పరిశీలించి, నష్టం నమోదు చేసి, ప్రభుత్వానికి నివేదిస్తారు. 33 శాతానికి పైబడి నష్టం వాటిల్లితే ఇన్‌పుట్ సబ్సిడీ వస్తుంది.

పంటల బీమా ఇచ్చేదిలా..

పంటల బీమా రావాలంటే గతంలో మండలాన్ని యూనిట్‌గా తీసుకుని ఇచ్చేవారు. దీనివల్ల అన్నదాతకు అంతగా ఉపయోగం ఉండేదికాదు. ఇప్పుడు ఆర్‌బీకేలో ఈ-క్రాప్ బుకింగ్ చేసుకున్న రైతుకు, కౌలు రైతుకు కూడా నష్టం వాటిల్లితే పంటల బీమా వర్తింపచేస్తున్నారు. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం ఈ బీమా నిర్ణయిస్తున్నారు. అంటే ఒక సీజన్‌లో పంట పండించడానికి ఎంత పెట్టుబడి అవుతుందో లెక్కలు కట్టి, బ్యాంక్‌లు, సొసైటీల ద్వారా ఆ మేరకే పంట రుణాలు మంజూరు చేస్తున్నారు. ప్రతి సీజన్‌లో కోతలకు ముందు నాలుగు పంటకోత ప్రయోగాలు చేస్తారు. అది కూడా కంప్యూటర్ ద్వారా ఆ గ్రామంలో ర్యాండమ్‌గా నాలుగు సర్వే నంబర్లు ఎంపిక చేసి, వ్యవసాయ శాఖకు తెలియజేస్తారు. ఏయే సర్వే నంబర్లలో పంటకోత ప్రయోగాలు చేయాలో సమాచారం వచ్చిన తర్వాత.. పంట కోతకు వచ్చిన వెంటనే వ్యవసాయాధికారులు ఆయా ప్రాంతాల్లో 5 చదరపు అడుగుల విస్తీర్ణంలో పంట కోసి, వచ్చిన ధాన్యం బరువు తూచి, తేమ శాతం తీసి ఎకరాకు ఎన్ని బస్తాలు (75 కిలోలు) దిగుబడి వస్తుందో లెక్క కడతారు. నాలుగు చోట్ల వచ్చిన సరాసరి దిగుబడిని యాప్‌లో రైతు పేరున నమోదు చేస్తారు. మండల పరిధిలోని గ్రామాల వారీగా వచ్చిన దిగుబడిని కలెక్టరేట్‌లోని స్టాటిస్టిక్స్ విభాగానికి, అక్కడి నుంచి ప్రభుత్వానికి నివేదిస్తారు. పంట దిగుబడి రావాల్సిన సగటు కంటే తక్కువగా వస్తేనే పంటల బీమా వస్తుంది. ఏ గ్రామంలో సగటు కంటే ఎంతమేర దిగుబడులు తగ్గాయో లెక్క కట్టి, ఒక ఎకరానికి మంజూరు చేయాల్సిన బీమా శాతాన్ని నిర్ణయిస్తారు. దాని ప్రకారం రైతుకు ఉండే విస్తీర్ణాన్ని బట్టి ఆయా గ్రామంలో జరిగిన నష్టతీవ్రతను బట్టి పంటలబీమా వస్తుంది.

సత్తా చాటిన విద్యార్థినులకు అభినందనలు

పిఠాపురం: స్థానిక ఆర్‌ఆర్‌బీహెచ్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినులు జిల్లాలో అత్యధిక మార్కులు సాధించి తమ సత్తా చాటుకున్నారు. ఇంటర్ మొదటి సంవత్సరం సీఈసీలో జీఎస్ సౌజన్య 500కు 488, షేక్ ఆషా బేగం 480 మార్కులతో జిల్లాలోనే ప్రభుత్వ కళాశాలల్లో టాపర్లుగా నిలిచారు. వారిని కళాశాలలో గురువారం నిర్వహించిన సభలో ప్రిన్సిపాల్ వూటుకూరి కేశవరావు ప్రత్యేకంగా అభినందించారు. మంచి మార్కులు సాధించడానికి ప్రతి విద్యార్థీ వీరిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు.



జీఎస్ సౌజన్య



షేక్ ఆషాబేగం